1న పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఏప్రిల్ 1వ తేదీన పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పథకం కింద 1వ తేదీన పెన్షన్ల పంపిణీకి సంబంధించిన సన్నద్ధతపై డీఆర్డీఏ, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, బ్యాంకు నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద మొత్తం పింఛన్లు 2,79,165 ఉండగా, పెన్షన్ల మొత్తం 123.76 కోట్ల రూపాయలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. 1వ తేదీన ఉదయం 7 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. ఎలాంటి హడావుడి లేకుండా పెన్షన్లను పంపిణీ చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, ఎల్డీఎం నర్సింగరావు, సిపిఒ అశోక్ కుమార్, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై లఘు చిత్రాలు ఆవిష్కరణ

అనంతపురం : విద్యుత్ ప్రమాదాలను నివారించే క్రమంలో పలువురు నిర్మించిన లఘుచిత్రాలను కలెక్టర్ కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు కృషి అవసరమన్నారు. ఎలక్ట్రికల్ సేఫ్టీపై లఘు చిత్రాలు, విద్యుత్ ప్రమాదాలపై విస్తృత ప్రచారం కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ శేషాద్రి శేఖర్, ఇఇ రమేష్, డిప్యూటీ శ్రీనివాసులు రామకృష్ణ, ఇన్స్‌పెక్టర్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

నాటి వాగ్దానాలు గుర్తులేవా..?

◆ విద్యుత్ భారాలపై సిపిఎం ఆగ్రహం ◆ కూటమి ప్రభుత్వ తీరుపై నిరసన

అనంతపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

'తాము అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తాం... సెకీ ఒప్పందాలను రద్దు చేస్తాం.. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగుల గొడతాం'... అంటూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో సమయంలో కూటమి నేతలు చేసిన వాగ్దానాలు అధికారంలోకి రాగానే గుర్తుకురావడం లేదాని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నాడు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. విద్యుత్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద బైటాయించి ఆందోళన చేపట్టారు. అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

వార్త 6లో

మరోమారు ఎంపిపి ఎన్నిక వాయిదా

◆ బహిష్కరిస్తున్నట్టు ప్రకటించిన రామగిరి వైసిపి ఎంపిటిసిలు ◆ గైర్హాజరుతో గాండ్లపెంట వాయిదా

గాండ్లపెంట ఎంపిపి ఎన్నిక కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సత్యసాయి జిల్లాలోని రామగిరి, గాండ్లపెంట ఎంపిపి ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించే విధంగా రసవత్తరంగా మారాయి. బలమున్న తమ స్థానాలను నిలపుకోవాలని వైసిపి ప్రయత్నిస్తుండగా, అధికార బలాన్ని ఉపయోగించి ఏదో రకంగా తమ వైపు తిప్పుకునేందుకు అధికార టిడిపి ప్రయత్నాలు చేస్తోంది. ఇద్దరి మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో ఈ రెండు స్థానాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే రెండుసార్లు ఈ రెండు స్థానాల్లో ఎన్నిక వాయిదా పడింది. మూడవసారి శుక్రవారం జరగాల్సి ఎన్నిక కూడా మరోసారి వాయిదా పడింది. ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో తదుపరి ఏమి జరుగుతుందో అన్న ఆసక్తి నెలకొంది.

రామగిరి ఓటింగ్‌కు వైసిపి బహిష్కరణ

రామగిరి ఎంపిపి ఎన్నికను తాము బహిష్కరిస్తున్నట్టు ఐదుగురు వైసిపి ఎంపిటిసిలు తెలుపుతూ ఒక వీడియోను విడుదల చేశారు. రామగిరి మండలం పరిధిలో తొమ్మిది ఎంపిటిసిలున్నారు. ఇందులో ఒక్క స్థానం మినహా అన్నింటినీ ఇది వరకు వైసిపి గెలిచింది. ఇందులో ఇప్పుడు కొంత మంది టిడిపిలో చేరారు. ఇంకా మెజార్టీ వైసిపి వైపే ఉంది. ఈ నేపథ్యంలో ఎంపిపి ఎన్నిక జరుగుతుండటంతో ఇదివరకు పార్టీలో చేరిన వారితోపాటు అదనంగా తీసుకుంటే ఎంపిపి స్థానాన్ని సాధించవచ్చునని టిడిపి భావిస్తోంది. ఏదో రకంగా తమ పట్టును నిలుపుకునేందుకు వైసిపి ప్రయత్నిస్తోంది ఈ నేపథ్యంలోనే ఇరువైపులా ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది. ఈ నేపథ్యంలో గురువారం నాడు పెనుకొండలో పెద్దఎత్తున ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఇక లాభం లేదనుకుని ఎన్నికకే హాజరవకుండా బహిష్కరిస్తూ శుక్రవారం నాడు వైసిపి ఐదుగురు ఎంపిటిసిలు వీడియో విడుదల చేశారు. దీంతో ఎన్నిక జరగలేదు.

గాండ్లపెంటలోనూ వాయిదా

గాండ్లపెంట ఎన్నిక కూడా వాయిదాలపై వాయిదాలు పడుతూ వస్తోంది. శుక్రవారం జరగాల్సిన ఎన్నికకు కోరం లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి ఎన్నికను వాయిదా వేశారు. ఇక్కడ కూడా అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి మధ్య పట్టు కోసం పోరు నడుస్తోంది.

ప్రకాష్‌రెడ్డి పద్ధతి మార్చుకో..

పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

'ప్రకాష్‌రెడ్డి నీ పద్ధతి.. మాట తీరు మార్చుకో... లేకుంటే నీవు కలుగులో దాకున్నా వదిలేది.. లేదు.' అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడారు. మీ సభ్యులపై నమ్మకముంటే రామేశ్వరం వరకు ఎందుకు వెళ్లావని ప్రశ్నించారు. విప్ జారీ పేరుతో బిసి నాయకులను అక్కడి పంపి ఉద్దేశ్యపూర్వకంగా కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. అంత ధైర్యముంటే నీ సోదరులను ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. పక్క డివిజన్‌లోకి తీసుకెళ్లి వైసిపి జిల్లా అధ్యక్షురాలితో కలసి నాటకాలు ఎందుకు ఆడుతున్నావని మండిపడ్డారు. ఒక రౌడీల బూతులు తిడుతూ అధికారులపైకే వెలుతావా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

జెడ్పీ చైర్‌పర్సన్ గృహనిర్బంధం

గృహ నిర్బంధంలో ఉన్న జెడ్పీ చైర్‌పర్సన్

రామగిరి మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను ఆమె క్యాంపు కార్యాలయంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఎలాంటి అంవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గృహనిర్బంధంలో ఉన్న గిరజమ్మను వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి పంచాయితీ రాజ్ విభాగం అధ్యక్షులు వెన్నపూస రవీంద్రా రెడ్డిలు పరామర్శించారు.

మార్కెట్ యార్డు చైర్మన్ల నియామకం

రాయదుర్గం-హనుమంతురెడ్డి..?-కళ్యాణదుర్గం-బోయ లక్ష్మీదేవి-గుంతకల్లు-సుగాలి లక్ష్మీదేవి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

హనుమంతురెడ్డి

రాయదుర్గం మార్కెట్ యార్డు చైర్మన్‌గా యు.హనుమంతురెడ్డి నియమించనున్నట్లు సమాచారం. నియోజకవర్గంలోని డి.హీరేహాల్ మండలం గొడిసెలపల్లికి చెందిన హనుమంతురెడ్డి టిడిపిలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. అంతేగాకుండా విప్ కాలవ శ్రీనివాసులుకు అత్యంత సన్నిహితులు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాలవ శ్రీనివాసులు వెన్నంటే ఉండి రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఎమ్మెల్యే సహకారంతో గొడిసెలపల్లి గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారు. డి.హీరేహాల్ మండల కన్వీనర్‌గా సమన్వయంతో పార్టీ కార్యక్రమాలు, సభ్యత్వ నమోదును విజయవంతంగా నిర్వహించారు. కార్యకర్తలకు అండగా ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ తనదైన ముద్ర వేసుకున్నారు. హనుమంతురెడ్డి చేసిన సేవలను గుర్తించి మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమించనునట్లు తెలిసింది.

సుగాలి లక్ష్మీదేవి

గుంతకల్లు : గుంతకల్లు మార్కెట్ యార్డు చైర్మన్ మాజీ జెడ్పీటీసీ మాతృనాయక్ భార్య సుగాలి లక్ష్మీదేవి నియమితులయ్యారు. గుంతకల్లు మార్కెట్ యార్డు చైర్మన్ స్థానాన్ని బీసీ సామాజిక వర్గానికి (కురుబ) కేటాయించేలా సిఫార్సు చేయాలని మంత్రి సవిత స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌కు పలుమార్లు సూచించినా చివరకు ఎస్టీ మహిళకు దక్కింది. కూటమి ప్రభుత్వం మార్కెట్ యార్డుల చైర్మన్ల లిస్టు విడుదల చేయగానేనే టిడిపి పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ కార్యాలయంలో మాతృనాయక్‌కు టిడిపి నేతలు శాలువాలు పూలదండలతో సన్మానం చేశారు.

బోయ లక్ష్మీదేవి

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా గోళ్ల గ్రామానికి చెందిన బోయ లక్ష్మీదేవి నియమితులయ్యారు. హత్యకు గురైన మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోళ్ల బాదన్న కోడలు లక్ష్మీదేవి. బాదన్న కుటుంబం పార్టీ కోసం చేసిన త్యాగాలు, సేవలను గుర్తించిన టిడిపి అధిష్టానం లక్ష్మీదేవికి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ పదవి కేటాయించినట్లు తెలుస్తోంది. తనకు పదవి కేటాయించినందుకు టిడిపి అధినేత చంద్రబాబు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

544-డి రోడ్డు నిర్వాసితులకు న్యాయం చేయాలి

రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు, నిర్వాసితులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పాముదాయి నుంచి బోగసముద్రం వరకూ నిర్మిస్తున్న 544-డి రోడ్డు భూ నిర్వాసితులకు ప్రస్తుత ధరల ప్రకారం పరిహారం చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో 544-డి రోడ్డు భూ నిర్వాసితులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో రైతుల భూములు, ఇళ్లు కోల్పోతున్నారని తెలిపారు. 2018లో అధికారులు ఇళ్లు పోతాయని సర్వే చేశారని, రెవెన్యూ అధికారులు స్వయంగా పరిశీలనకు వచ్చినప్పుడు గ్రామసభ నిర్వహించి జరగబోయే నష్టం చూపించి మీకు న్యాయం చేస్తామని రెట్టింపు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పట్టా భూమి అసైన్డ్ భూమికి ఒకే పరిహారం ఇస్తామని చెప్పి మోసం చేశారని, 2018 ధరలకు అనుగుణంగా ధర నిర్ణయించి రెండు రెట్లు అధికంగా ఇస్తామని చెప్పి మాకు అన్యాయం చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే 27-3-25న గురువారం 2018 లెక్కల ప్రకారం పరిహారం కొంత మందికి చెల్లించారని, జరిగిన నష్టపరిహారం కాకుండా 2018లోని మార్కెట్ విలువ అంచనా ప్రకారం చెల్లించారన్నారు. పరిహారం సంబంధించిన జాబితా కూడా ఎవరికీ తెలియకుండా చేసి బాధితులకు అన్యాయం చేశారని తెలిపారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరూపాక్షి, బిహెచ్.రాయుడు, బాధితులు రంగారావు, గాంధీ, శివ శంకర్, శ్రీనాథ్, నారాయణస్వామి, కాసిం పీరా, నవీన్, బ్రహ్మయ్య, సురేంద్ర, శ్రీరాములు, లక్ష్మీనారాయణ, జయమ్మ, పుష్పావతి, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి కెవిపిఎస్ సంతాపం

కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళి అర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రముఖ క్రైస్తవ ప్రబోధకుడు పాస్టర్ పగడాల ప్రవీణ్ మతిపై రిటైర్డ్ జడ్జ్ తోసమగ్ర విచారణ జరిపించాలని, హత్యకు కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ మృతిని నిరసిస్తూ అనంతపురం రూరల్ అధ్యక్షులు జీవరత్నం అధ్యక్షతన శుక్రవారం కెవిపిఎస్ అనంతపురం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో లలిత కళ పరిషత్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిర్వహించిన కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డాక మైనార్టీలపై జరుగుతున్న దాడులు మతోన్మాదులు హత్యలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారని విమర్శించారు. ప్రవీణ్ మరణం ముమ్మాటికి మతోన్మాదుల హత్యేనన్నారు. ప్రవీణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి వెంకటేష్, నగర అధ్యక్షులు అక్కులప్ప, రూరల్ కార్యదర్శి రాజా, సిఐటియు జిల్లా నాయకులు రామిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాల రంగయ్య, ప్రజా సంఘాల నాయకులు మసూద్, కెవిపిఎస్ నాయకులు వెంకటనారాయణ, పుల్లన్న, నాగేంద్ర, వెంకటేష్, ఎర్రిస్వామి, డేవిడ్, లక్ష్మీనారాయణ, సత్యం, ప్రకాష్, లాలు, నాగేంద్ర, సీనా, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సెలవుపై తహశీల్దార్..?

ప్రజాశక్తి-యల్లనూరు

రెండు రోజుల క్రితం ఓ గ్రామ స్థాయి టిడిపి నాయకుని ప్రవర్తనతో విసుగు చెందిన మండల తహశీల్దార్ రాజు సెలవుపై వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల క్రితం తిరుమలాపురం గ్రామానికి చెందిన చౌక దుకాణం వ్యవహారంలో అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు తహశీల్దార్‌తో వాగ్వాదానికి దిగాడు. టిడిపి అధికారంలోకి వచ్చిన రేషన్ షాపు వ్యవహారాన్ని ఎందుకు పరిష్కరించడం లేదంటూ ఆయన తహశీల్దార్‌ను నిలదీశాడు. ఈ పరిణామంతో మనస్తాపం చెందిన తహశీల్దార్ సెలవు పెట్టి వెళ్లినట్లు తెలుస్తోంది.

హంద్రీనీవా లైనింగ్‌తో నష్టం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

హంద్రీనీవా లైనింగ్ పనులతో సీమ ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని న్యాయవాదులు పేర్కొన్నారు. హంద్రీనీవా ప్రయోజనాలకు సమాధి కట్టే కాలువ లైనింగ్ పనులు రద్దుచేసి, రోజుకు ఒక టిఎంసి ప్రవాహ సామర్థ్యానికి కాలువ వెడల్పు చేయాలని కోరుతూ జలసాధన సమితి ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాన్ని శుక్రవారం నగరంలోని జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మాట్లాడుతూ హంద్రీనీవా ప్రాజెక్టు నిర్దేశించిన విధంగా రాయలసీమలో ఆరు లక్ష ఎకరాలు, ఉమ్మడి జిల్లాలో 3,45,000 వేల ఎకరాలకు నీరు ఇస్తేనే ఈ ప్రాంత రైతులు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కాలు వెడల్పు చేయకుండా లైనింగ్ చేయటం వల్ల ప్రయోజనం లేదన్నారు. ఈ ప్రాంత రైతుల అభీష్టం మేరకు కాలువ వెడల్పు పనులను ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఒపిడిఆర్ జిల్లా సహాయ కార్యదర్శి జిసి.ప్రకాష్, ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరు, సతీష్, న్యాయవాదులు వెంకట రఘుకుమార్, మురళీకృష్ణ, అశోక్ కుమార్ రెడ్డి, సురేష్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న న్యాయవాదులు

నేడు సిపిఎం ఆధ్వర్యంలో సదస్సు

అనంతపురం కలెక్టరేట్ : ట్రంప్ విధానాలు-భారతదేశంలో ప్రభావం అనే అంశంపై సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.అరుణ్‌కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. కావున పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఇఫ్తార్‌కు వెళ్లొద్దని చెప్పడానికి మీరెవరు..?

అనంతపురం : ఇఫ్తార్ విందుకు వెళ్లవద్దని చెప్పేందుక నీవెవరు అంటూ అనంతపురం అర్బన్ టిడిపి మైనార్టీ నాయకులు నగర మేయర్ మహమ్మద్ వసీంను ప్రశ్నించారు. శుక్రవారం నగరంలోని టిడిపి అర్బన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమీవేశంలో టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్ మాట్లాడుతూ దేశంలో సర్వ మతాలు ఒక్కేటనన్నారు. హిందువులు కూడా ఇఫ్తార్ విందులకు వస్తూ స్నేహభావంతో ఉంటారన్నారు. ఈనేపథ్యంలో మతసామరస్యాన్ని దెబ్బ తీసే విధంగా ఇఫ్తార్ విందుకు వెళ్లవద్దంటూ మేయర్ వసీం వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు గురించి మాట్లాడుతున్న మేయర్ గతంలో ఎన్ఆర్‌సి, సిఎఎ, విదేశీ విద్యా వంటి వాటిపై గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మైనార్టీలపై దాడులు జరిగినప్పుడు మీరు ఎక్కడున్నారని నిలదీశారు. కనీసం మసీదులకు కూడా నిధులు ఇవ్వలేదన్నారు. మైనార్టీలకు పదవులు ఇస్తున్నామని చెప్పి పథకాలు రద్దు చేశారన్నారు. మీరు మైనార్టీలు ద్రోహం చేశారు కాబట్టే 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సైపుద్దీన్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, మైనారిటీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి జెఎం బాషా, మైనార్టీ నాయకుడు ఖలందర్ పాల్గొన్నారు.

జెఎన్‌టియు స్నాతకోత్సవాన్ని విజయవంతం చేద్దాం

ఉపకులపతి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం



మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవాన్ని డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది సమిష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని ఉపకులపతి హెచ్.సుదర్శనరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉపకులపతి అధ్యక్షతన వర్శిటీలోని కాన్ఫరెన్స్ హాలులో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఒఎస్‌డి వీసీ ఎన్.దేవన్న, అధికారులతో కలిసి స్నాతకోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా స్నాతకోత్సవంలో నిర్వహించాల్సిన విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు ఎస్‌వి సత్యనారాయణ, పిఆర్ భానుమూర్తి, వైశాలి ఘోర్పడే, నాగప్రసాద్, శోభ బిందు, సుజాత, పద్మ సువర్ణ, కిరణ్మయి, విబి చిత్ర, సురేష్‌బాబు, దుర్గాప్రసాద్, ఒటిపిఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.మాధవి, స్పోర్ట్స్ కౌన్సిల్ టి.నారాయణరెడ్డి, కోఆర్డినేటర్లు జె.శ్రీనివాసులు, అరుణ మస్తాని, అరుణ, శారద, తదితరులు పాల్గొన్నారు.

మెప్పించిన బాలల ఆవిష్కరణలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన వైజ్ఞానిక పోటీల్లో విద్యార్థిని విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలతో ప్రతిభ చాటుకున్నారు. జెవివి ఇటీవల నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన ప్రశాంతి విద్యా నికేతన్ స్కూల్, లక్ష్మీ సినర్జీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని విద్యార్థులు రాష్ట్ర స్థాయి 2 ద్వితీయ బహుమతులు సాధించారు. యురేకా సైన్స్ ఎక్స్‌పో 2025 పేరుతో ఆన్‌లైన్‌లో జెవివి పోటీలు నిర్వహించింది. పర్యావరణం, సుస్థిర అభివృద్ధి, సైన్స్ అండ్ టెక్నాలజీ, మూఢ నమ్మకాలు, శాస్త్రీయ దృక్పథం అంశాలపై 8, 9, 10 తరగతుల విద్యార్థులు తమ ప్రయోగాలను వీడియో తీసి పంపించారు. 386 ప్రయోగాలు రాగా వాటిలో అత్యుత్తమైనవి ఎంపిక చేసి విజేతలను ప్రకటించారు. అందులో అనంతపురం జిల్లా నుంచి లక్ష్మీ సినర్జీ హైస్కూల్ విద్యార్థులు, ప్రశాంతి విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు 2 బహుమతులు రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతులు సాధించారు. విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లాకు బహుమతులు సాధిచడం పట్ల జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, నగర అధ్యక్షులు ఎం.రామిరెడ్డి అభినందనలు తెలిపారు.

కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రితో ఎంపి అంబికా భేటీ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్



కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపి అంబికా

కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా అనంతపురం కార్పొరేషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి నిధులు కేటాయించాలని కోరారు. అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్, అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ 2.0 పరిధిలో వందశాతం పారిశుధ్య నిర్వహణ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ మురుగు నీటి సమస్యలు ఉన్న కారణంగా చేయలేకపోతున్నామని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నగరంలో సరైన భూగర్భ మురుగు నీటి వ్యవస్థ లేకపోవడం, ఇళ్ల నుంచి వెలువడే మురుగు నీరు నేరుగా ఓపెన్ డ్రైన్స్‌లోకి పోవడంతో, మరువవంక, నడిమివంక తీవ్ర కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. అంతేగాకుండా తడకలేరు నది, శింగనమల చెరువును ప్రభావితం చేసి తాగునీటి వనరులు, వ్యవసాయాన్ని దెబ్బ తీస్తోందన్నారు. కావున ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అనంతపురం నగరానికి భూగర్భ మురుగు వ్యవస్థతో పాటు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను మంజూరు చేయాలని కోరారు.

మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటుకు వినతి

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్‌లో ఆహార ప్రాసెసింగ్ రంగం అభివృద్ధిలో భాగంగా అనంతపురంలో మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటు చేయాలని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈమేరకు కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజుతో కలిసి శుక్రవారం ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి రంజిత్ సింగ్‌ని కలిసి విన్నవించారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రామాణీకరణ పథకం అమలులో భాగంగా తిరుపతి, విశాఖపట్నం జిల్లాల్లో మంజూరైన రెండు ఇన్‌క్యుబేషన్ సెంటర్ల ప్రగతిపై చర్చించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

విద్యుత్ భారాలు దుర్మార్గం

పెంచిన ఛార్జీలను తగ్గించాలి-సెకీ ఒప్పందాలను రద్దు చేయాలి-సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రతిపక్షంలో ఉన్న సమయంలో విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని చెప్పి, అధికారంలోకి రాగానే ట్రూఅప్ పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం దుర్మార్గం అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ విమర్శించారు. విద్యుత్ భారాలను నిరసిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం విద్యుత్ ఎస్ఇ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. సిపిఎం నాయకులు వెంకటనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. గతంలో జగన్ ప్రభుత్వం సెకీ, అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును కూటమి నేతలు ప్రతిపక్షంలో ఉన్న సమయం తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేస్తామని హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే హామీని విస్మరించి గత ప్రభుత్వం కంటే వేగంగా సెకీ ఒప్పందాలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.16 వేల కోట్ల భారం మోపారని మండిపడ్డారు. సర్దుబాటు, ట్రూఅప్ పేరుతో విద్యుత్ ఛార్జీల భారం మోపి పేదల నడ్డివిరిచారని తెలిపారు. సెకీతో చేసుకున్న ఒప్పందంలో కోట్లు లంచాలు ఇచ్చి రాష్ట్రంలో ఈ పద్ధతిని అమలు చేస్తున్నారంటే ఆ కంపెనీల ప్రయోజనాల కోసం గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఎంత ఆరాట పడుతున్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజలపై ప్రభుత్వాలు వేస్తున్న భారాలు, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సామాన్యుడు విలవిల్లాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, సెకీ ఒప్పందాలు రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వం స్పందించకుంటే ప్రజలతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, బాల రంగయ్య, చంద్రశేఖర్ రెడ్డి, సావిత్రమ్మ, కృష్ణమూర్తి, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు, పరమేష్, నగర కమిటీ సభ్యులు ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, వెంకటేష్, జీవ, ఓబులేసు, ఎర్రిస్వామి, పోతులయ్య, విరుపాక్ష, ఇస్మాయిల్, దేవిడ్, టొట్టు రాము, శంకర్, శంషాద్, చంద్రిక, అశ్విని పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోకపోతే ఉద్యమిస్తాం సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ.నల్లప్ప మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నెలల వ్యవధిలోనే రెండుసార్లు విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో పేదలపై రూ.15,485 కోట్ల భారం వేసిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సర్దుబాటు ఛార్జీలను తీవ్రంగా విమర్శించిన తెలుగుదేశం, జనసేన నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాన్ని కొనసాగించడం బాధాకరమన్నారు. బడా కార్పొరేట్ల కోసమే కేంద్రం స్మార్ట్ మీటర్లను తీసుకొస్తుందన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం వంత పాడటం బాధాకరమన్నారు. ట్రూ అప్ ఛార్జీలను తగ్గించుకోవడంతోపాటు స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి ఆర్ కుళ్లాయప్ప, కమిటీ సభ్యులు పుల్లయ్య, నాగరాజు, చంటి, అంకాలు, చిన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : గుంతకల్లు పట్టణంలోని ఆలూరు రోడ్డులో ఉన్న విద్యుత్ శాఖ డిఇ కార్యాలయం ఎదుట శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ డిఇ నాగేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, పట్టణ కార్యవర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్రబాబు, కమిటీ సభ్యులు రామునాయక్, షాషా, అబ్దుల్లా, ఓబులేసు, సూరి, ఈరన్న, శివయ్య, జీవన్ మోహన్, మగ్బుల్, సాగర్, రాజు, హుస్సేన్ పీరా తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : శింగనమల మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ సాకే బ్రహ్మయ్యకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు కొండారెడ్డి శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు, అంజి, మునెప్ప, వెంకట్రాముడు, జయరాముడు, కేశన్న, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయడంతోపాటు స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలని, సెకీ ఒప్పందం రద్దు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, నాయకులు ఈశ్వరయ్య, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

బుక్కరాయసముద్రంలో వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఉరవకొండ : విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేసి, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సిపిఎం, కౌలు రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, జిల్లా నాయకులు పెద్దముష్టూరు వెంకటేశులు, మోపిడి సుంకన్న, సిపిఎం నాయకులు రామాంజనేయులు నాయక్, సీనప్ప, సిద్ధప్ప, రవికుమార్, మురళి, రవి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు చాబాల సుధాకర్, హమాలీ పెద్దన్న, సుధాకర్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్ : ఇంధన సర్దుబాటు, ట్రూ అఫ్ ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్, మండల కార్యదర్శి రంగనాథ్, ఎస్ఎఫ్ఐ నాయకులు భవిత్, బాలాజీ గాంధీ, డివైఎఫ్ఐ నాయకులు సోము, నాయకులు ఒంటిమద్ది గోవిందు, రామచంద్ర, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల నిర్వహణలో కమిషన్ విఫలం

వైసిపి పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎంపిపి, వైస్ ఎంపిపిలు, జెడ్పీఛైర్మన్‌ల ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్‌తోపాటు కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందాయని వైసిపి పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి విమర్శించారు. శుక్రవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపికి సంఖ్యా బలం లేకున్నా ఎంపిపి, వైస్ ఎంపిపిలను కైవసం చేసుకోవాలని చూడటం బాధాకరమన్నారు. ముఖ్యంగా రామగిరిలో టిడిపికి ఒకేఒక ఎంపిటిసి ఉన్నా తమ ఎంపిటిసిలను భయభ్రాంతులకు గురి చేసి ఎన్నికను వాయిదా వేయించారని ఆరోపించారు. పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కళ్యాణ్ ఎన్నికల నిర్వహణపై పత్తాలేకుండా పోయారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చిన తమ పార్టీ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. పోలీసులు కూడా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని హితువు పలికారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రారెడ్డి

జాతీయస్థాయి సాంకేతిక సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్‌చ కంప్యూటర్ సైన్స్, డిజైన్ విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జెఎన్‌టియు ప్రొఫెసర్ శివకుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంతోపాటు పరిశోధనా దృష్టి కలిగి ఉండాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ఆవిష్కరణలకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. ఈ సింపోజియంలో 200 మంది విద్యార్థులు పాల్గొని తమ టెక్నికల్ నైపుణ్యాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ పల్లె వెంకట కృష్ణకిషోర్, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, సిఎస్ఇ విభాగాధిపతి దిలీప్ వెంకటకుమార్, సిఎస్‌డి విభాగాధిపతి అవనిజా, ధరణికుమార్, కోఆర్డినేటర్లు టీ.బాబా, శ్రావణి, కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ఎఒ మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అతిథిని సన్మానిస్తున్న పివికెకె సిబ్బంది

ఎస్సీ, ఎస్టీలకు భూ పంపిణీ చేయాలి

ఉరవకొండ : భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం భూపంపిణీ చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. శుక్రవారం వజ్రకరూరు మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భూమిలేని దళిత, గిరిజన కుటుంబానికి మూడెకరాలు చొప్పున భూ పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు బెంజిమాన్ ఏసన్న, జెఎసి నాయకులు చాబాల సురేష్‌బాబు, గుడిసె రవీంద్ర, సుధాకర్, దావీదు, కడమలకుంట సుంకన్న, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, చంద్ర, రామకృష్ణ, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో ఎడిజె కోర్టు ఏర్పాటుకు వినతి

అనంతపురం : కదిరిలో ఎడిజె కోర్టు ఏర్పాటు చేయాలని కదిరి బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈమేరకు జిల్లా జడ్జి శ్రీనివాసులును కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌడప్ప, సీనియర్ న్యాయవాది భైరవ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, కదిరి బార్ అసోసియేషన్ సభ్యులు సంయుక్త కార్యదర్శి శివశంకర్, జాతీయ మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు సాయితేజ కొండిశెట్టి, న్యాయవాదులు రామస్వామి నాయుడు, ఛత్రేనాయక్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగ విరమణ

అనంతపురం : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సర్వీస్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న కఠారి తార మోహన్‌రావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ భవనంలో కార్యాలయ సిబ్బంది తార మోహన్‌రావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ నారాయణస్వామి, ప్రోగ్రాం అధికారులు యుగంధర్, అనుపమ జేమ్స్, రవిశంకర్, డిఎంఒ ఓబులు, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్‌రావు, సిబ్బంది శ్రీనివాసులు, విజయ భాస్కర్‌రెడ్డి, కమలాకర్‌రాజు, రీగన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నర్సింహులు మృతి

పామిడి : బ్రాహ్మణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గొల్లపల్లి నర్సింహులు (91) మృతిచెందారు. అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారఝామున కన్నుమూశారు. ఈయన బ్రాహ్మణ సంఘానికి 40ఏళ్లపాటు అధ్యక్షులుగా పని చేశారు. ఎన్‌వి గుప్తా నిర్మించిన శివ పంచాయతన నగరేశ్వరస్వామి దేవస్థానాన్ని బ్రాహ్మణ సంఘానికి ఇచ్చే ఏర్పాటు చేశారు. ఆ ఆలయానికి చక్కతేరు ఏర్పాటుకు కృషి చేశారు. శృంగేరి పీఠాధిపతిని సంప్రదించి పాలరాతి అదిశంకరాచార్య విగ్రహాన్నితెప్పించి ప్రతిష్టింపజేశారు.

ఘనంగా 'అనంతలక్ష్మి' వార్షికోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం

నగర సమీపంలోని ఇటుకలపల్లి సమీపంలో ఉన్న అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనంతపురం డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణ, సత్ప్రవర్తను కలిగి ఉండాలన్నారు. అంతేగాకుండా శాస్త్ర సాంకేతికత రంగంలో మార్పులను గమనించి కొత్త ఆవిష్కరణలు చేసే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అందుకు అనువైన వాతావరణం, సౌకర్యాలు కల్పిస్తున్నందుకు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల ఛైర్మన్ అనంతరాముడు మాట్లాడుతూ పిల్లలందరూ బాగా చదువుకుని పాఠశాల, తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తేవాలన్నారు. అంతేగాకుండా దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల సిఎఒ నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షాలిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనంతలక్ష్మి పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న అతిథులు

అద్దెల వసూళ్లకు వేలం

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామ పరిధిలో వెలసిన బాట సుంకలమ్మ ఆలయ ఆవరణలో ఉన్న వాణిజ్య దుకాణాల గదులకు శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. 14 గదుల అద్దె హక్కు కోసం వేలంపాట నిర్వహించగా పలువురు పోటాపోటీగా పాట పాడి గదులను దక్కించుకున్నారు. గదులకు సంబంధించిన నెలకు రూ.1.15 లక్షల ఆదాయం దక్కిందని ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు కె.వెంకటనాయుడు, కె.గుర్రప్ప, జె.చిన్న రంగస్వామి, ఎన్.రామకృష్ణ, వి.శ్రీనివాసులు, సర్పంచు కె.రమేష్‌నాయుడు, మాజీ సర్పంచులు వెంకటరాముడు, నరసింహులు, గ్రామ పెద్ద ఎస్.రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా

రాయదుర్గం : రాయదుర్గం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించాల్సిన జంతువధశాల వేలంపాటలను వాయిదా వేసినట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి గురువారం జంతువధశాల వేలంపాట నిర్వహించినా ఎవరూ పాట పాడటానికి ముందుకు రాలేదు. దీంతో శుక్రవారానికి వేలంపాట వాయిదా వేశారు. శుక్రవారం కూడా ఎవరూ వేలంపాటలో పాల్గొనక పోవడంతో శనివారానికి వాయిదా వేసినట్లు కమిషనర్ తెలిపారు.

వీధిలైట్లు ఏర్పాటు

శింగనమల : ఉగాది పండుగ సందర్భంగా మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామపంచాయతీలోని గుమ్మేపల్లి, ఏకులనాగేపల్లి గ్రామాల్లో సర్పంచు డేగల లలితమ్మ, టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి నాగరాజు, సచివాలయ వెల్ఫేర్ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌విజిఎం కళాశాల వార్షికోత్సవం

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతి విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి.జయరామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకునిఉన్నత స్థాయికి ఎదిగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, అధ్యాపకులు శైలజారాణి, సూర్యనాగిరెడ్డి, శ్రీధర్, జోష్ణ, కవిత, చాముండేశ్వరి, శ్యాంప్రసాద్, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారుల ఇకెవైసి గడువు పెంచాలి

అనంతపురం : రేషన్ కార్డుల దారులకు ఇకెవైసి చేయించుకునేందుకు గడువు పెంచాలని వైఎస్‌ఆర్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకెవైసి గడువు పెంచకపోతే ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. కావున ఇకెవైసి గడువును పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు కైలాష్, వెంకట్, నిశాంత్‌రెడ్డి, వంశీనాయుడు, నారాయణరెడ్డి, సాకే మురళీ, మహేష్‌రెడ్డి, సూర్య, శేఖర్, ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

యాడికి : జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కత్తిమానుపల్లి ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. తాడిపత్రి డివిజన్ జిపిఎంఒఒ మధుసూదనరాజు, జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న ఆదేశాల మేరకు ఐదుగురు విద్యార్థులకు కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టినిల్లు ఆశ్రమానికి శుద్ధ జలయంత్రం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం చేస్తున్న సేవలను అభినందిస్తూ గుర్రం ఫ్యామిలీ కుటుంబ సభ్యులు శుక్రవారం ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ మిషనరీని అందజేశారు. గుర్రం మహేష్ అమ్మ శేషమ్మ వర్ధంతిని పురస్కరించుకుని రూ.28వేలు విలువజేసే ప్యూరిఫైడ్ వాటర్ మిషనరీని విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి, గుర్రం మహేష్, సతీమణి మాధురి కుమార్తె వామిక, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు : సిఐ

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని పట్టణ సిఐ యువరాజ్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని టి సర్కిల్ నుంచి గాంధీచౌక్ వరకూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగను పురస్కరించుకుని పట్టణానికి ప్రజలు భారీగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తోపుడు బండ్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొదన్నారు.

పాస్టర్ హత్యపై విచారణకు డిమాండ్

రాయదుర్గం : ఇటీవల రాజమండ్రి సమీపంలో అనుమానాస్పద మృతిచెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాయదుర్గం ఫాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నాగరాజు, పోలీస్‌స్టేషన్‌లో ఫాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అధ్యక్షులు ఫాస్టర్ ఐజాక్ శామ్యూల్, ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ఆనంద్, కీర్తి దాసు, యెహొూషా, సత్యరాజ్, బెంజిమన్, థామస్, శివన్న, ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

బొమ్మనహాల్ : మండలంలోని శ్రీధర్‌ఘట్ పీహెచ్‌సీ డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సింగేపల్లి గ్రామంలో వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకే పొలాలకు వెళ్లే రైతులు, కార్మికులు ఇళ్లకు చేరాలన్నారు. అంతేకాకుండా మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఒఆర్ఎస్ నీటిని తాగుతూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్లు, సిహెచ్ఒలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెద్దపప్పూరు : మండలం కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో పీడీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై వారంరోజులుగా నిర్వహించిన సామాజిక తనిఖీపై శుక్రవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం కింద రూ.11,73,48,531 పనులు చేసినట్లు తెలిపారు. వీటితో రూ.2లక్షలు అవకతవలు జరగ్గా రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ శకుంతలమ్మ, ఎపిఒ గంగరాజు, మండల ఇంజినీర్ ప్రసన్నకుమార్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

అనంతపురం రూరల్ : జిల్లాకేంద్రంలోని వైసిపి కార్యాలయంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా ట్రేడ్ యూనియన్ జెండాను ఎగురవేశారు. తర్వాత కేక్ కోసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ విశ్వేశ్వర్‌రెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, నగర కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

నార్పల : మండల పరిధిలోని నాయనపల్లి రైతు సేవాకేంద్రంలో భూసార పరీక్ష ఫలితాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా భూసార పరీక్షల కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి, మండల వ్యవసాయ అధికారి సి.చెన్నవీరస్వామి, వ్యవసాయ విస్తరణ అధికారి రాము, నాయనపల్లి రైతు సేవాకేంద్రం గ్రామ వ్యవసాయాధికారి సరస్వతి, రైతులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

పామిడి : స్థానిక భోగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలో భక్తులు సమర్పించిన ఆదాయాన్ని శుక్రవారం లెక్కించినట్లు ఆలయ ఇఒ కృష్ణయ్య తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ కె.రాణి ఆధ్వర్యంలో లెక్కించగా రూ.1,62,479 నగదు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మురళీధర్ గుప్తా, పి.సురేష్‌కుమార్, అర్చకులు రామస్వామి, చంద్ర స్వామి, భక్తులు పివి వెంకటరాముడు, కె.నారాయణమూర్తి, యంగమ్మ, టి.గణేష్, మల్లికార్జున, డి.పవన్‌కుమార్, పార్వతమ్మ, హరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు అర్బన్ టిడిపి కార్యాలయానికి భూమిపూజ

అనంతపురం : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని శ్రీనగర్ కాలనీలో అర్బన్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. భూమిపూజలకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కాగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి వాడ, వీధిలో పసుపు జెండా ఎగురవేయాలన్నారు.

ఉద్యోగ విరమణ అధికారులకు సన్మానం

గుత్తి : ఈనెలాఖరుకు ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారులకు గుత్తిలోని కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. మున్సిపాలిటీలోని మెప్మా విభాగాన్ని చెందిన సిఎంఎం శ్రీనివాసరెడ్డిని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా శాలువాతో సత్కరించారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ శంకర్ పదవీ విరమణ సందర్భంగా తహశీల్దార్ డి.ఓబిలేసు, ఉప తహశీల్దార్ కె.సూర్యనారాయణ శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మేనేజర్ పి.రాంబాబు, మెప్మా సీఓలు చంద్రశేఖర్, సురేఖ, డిపిఒ నవీన్, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

రాయదుర్గం : పట్టణంలోని అజిజియా షాదీమహల్‌లో విప్ కాలవ శ్రీనివాసులు శుక్రవారం ముస్లిములకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముందుగా ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, అతఉర్ రహమాన్, ముస్లిములతో కలిసి ప్రార్థనలు చేశారు. రోజా విరమణ అనంతరం ముస్లింలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు కాలవ భరత్, మాజీ ఎమ్మెల్యే తనయుడు అజయ్, ముస్లిం మత పెద్దలు సనావుల్లా, హమీద్ సాబ్, షబ్బీర్, ఫక్రుద్దీన్, ఉస్మాన్, మహబూబ్ బాషా, ఇనాయత్ బాషా, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలను నివారించాలి

పామిడి : విద్యార్థులను ఆత్మహత్యలను ప్రభుత్వం నివారించాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలల వ్యవధిలోనే ఒక్క అనంతపురం జిల్లాలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేట్ విద్యాసంస్థల ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నారు. కావున వెంటనే విద్యార్థుల ఆత్మహత్యలను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్‌నాయక్, బాలాజీనాయక్, గోవర్ధన్, రాజు, రమేష్, భాస్కర్‌రెడ్డి, మణికంఠ, గోపీ, చంటి, అంజి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

యల్లనూరు : మండల పరిధిలోని చిలమకూరు ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో శుక్రవారం పదో తరగతి బయాలజీ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా సాగింది. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ డిప్యూటీ డిఇఒ శ్రీనివాసరావు ప్రజాశక్తితో మాట్లాడుతూ యల్లనూరు మండలంలోని పరీక్ష కేంద్రంలో 305 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 298 మంది రాసినట్లు తెలిపారు.

36 మంది బైండోవర్

పుట్లూరు : మండల పరిధిలోని మడుగుపల్లి గ్రామానికి చెందిన 31 మంది, పి.చింతలపల్లి గ్రామానికి చెందిన ఐదుగురిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు. మడుగుపల్లి గ్రామంలో త్వరలో భైరవస్వామి ఉత్సవాలు నిర్వహించనున్న దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేరాలు ఘోరాలు

కేబుల్ వైర్ చోరీ

పుట్లూరు : మండల పరిధిలోని మడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆరుగురు రైతులకు సంబంధించిన కేబుల్ వైర్లను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. మడ్డిపల్లికి చెందిన రైతులు వెంకటేశు, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రఘురామ్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, బి.రఘురామిరెడ్డి వారి తోటల్లో ఏర్పాటు చేసుకున్న ఎనిమిది మోటార్ల కేబుల్ వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. పోలీసులు విచ్చారించి తమకు న్యాయం చేయాలని కోరారు.

మెహ్ఫిల్ రెస్టారెంట్‌లో తప్పిన ప్రమాదం

అనంతపురం : స్థానిక సప్తగిరి సర్కిల్ లోని మెహ్ఫిల్ రెస్టారెంట్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. రెస్టారెంట్‌కి సంబంధించిన కిచెన్‌లో నుంచి బయటకు వెళుతున్న బ్లోయర్ లీకేజీ తో బయట మంటలు చెల్లరేగాయి. దీంతో ఫైర్ సిబ్బందికి రెస్టారెంట్ యాజమాన్యం సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి. కాగా సుమారుగా రూ.5 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగి ఉంటుందని యాజమాన్యం తెలిపింది. ఫైర్ సిబ్బందికి మేడ్చల్ రెస్టారెంట్ అధినేత తాజుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

మంటలను ఆర్పుతున్న స్థానికులు

శింగనమల : మండల పరిధిలోని చిన్నజలాల పురం గ్రామంలో మంగళ వెంకటేశ్వర్లకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఫైర్ ఇంజిన్ సిబ్బందికి ఫోన్ చేశారు. స్పందించిన ఫైర్ సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయినా గడ్డి పూర్తిగా కాలి బూడిదైంది. తద్వారా సుమారు రూ.1లక్ష వరకూ నష్టం వాటిలిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.